# అన్ని వారికేనా!

**ఖమ్మం, జనవరి 21, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గ్రామసభలు ప్రజల ఆగ్రహానికి గురయినాయి. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం బాహాటంగా ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అలా కనిపించలేదు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ప్రకటించిన అధికారుల జాబితాలో అధికార పార్టీ కార్యకర్తలకు, అభిమానులకి పెద్దపీట వేయడంతో ప్రజలు అసంతృప్తికి గురయ్యారు. అధికార పార్టీ వారిని ఎంపిక చేసేందుకే గ్రామ సభలు నిర్వహించాలని ప్రజలు నిరసన వ్యక్తం చేయడంతో తొలిరోజు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు అపహాస్యం పాలయినాయి. ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, వేంసూర్, తల్లాడ, వైరా, కూసుమంచి, ఖమ్మం రూరల్, చింతకాని తదితర మండలాల్లో మొదటి రోజు నిర్వహించిన గ్రామసభలు ప్రజల ఆగ్రహానికి గురైనాయి. సత్తుపల్లి మండలంలోని కిష్టారం, సిద్దారం గ్రామాల్లో జరిగిన సభలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనర్హులను ఇళ్ల లబ్ధిదారులుగా ప్రకటించారు అంటూ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. మళ్ళీ సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చింతకాని మండల కేంద్రంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు పంచాయతీ కార్యదర్శి రమేష్ అధ్యక్షత వహించగా, మండల పరిషత్ అధికారి (ఎంపీడీవో) రేబల్లి రామయ్య పథకాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామసభలో ప్రకటించిన పథకాల వివరాలు విన్న తర్వాత, గ్రామ ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. పథకాలు కేవలం కొంతమందికి మాత్రమే అందజేసి, చాలా మంది అసలైన అర్హులను పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేను సరైన విధంగా నిర్వహించలేదని, గ్రామంలో చాలా మంది ఇళు లేక అవస్థలు పడుతున్నారని ప్రజలు నిలదీశారు. ఎంపీడీవో రేబల్లి రామయ్యతో పాటు పంచాయతీ కార్యదర్శిని చుట్టుముట్టి ప్రశ్నించారు. ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నంలో ఎంపీడీవో రామయ్య మాట్లాడుతూ, ఈసారి పథకాలకు అర్హులుగా ఎంపిక కాకపోయినవారు నిరాశ చెందవద్దని, మరోసారి పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నాలుగు పథకాల అమల్లో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. వాటిలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కాకుండా అనర్హుల లిస్టు బయటకు రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఆత్మీయ భరోసాలు భాగంగా భూములు ఉన్నవారికి సైతం పేర్లు వచ్చాయని, అన్ని అర్హతలు ఉన్న లబ్ధిదారుల జాబితా రాలేదని గ్రామస్తులు వాపోయారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కూడా గతంలో ఇల్లు, భూములు, ఆర్థికంగా ఉన్నావారి పేర్లే వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వర్గానికి సంబంధించిన లబ్ధిదారుల లిస్టు వచ్చిందని, వాటిని పరిశీలించి అధికారులు అర్హులైన జాబితాను తయారు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం సరైనది కాదు అని, ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా అర్హులను గుర్తించి ఇండ్లను కేటాయించాలని అన్నారు. ఈ విషయాన్ని తన తీవ్రంగా ఖండిస్తున్నానని లబ్ధిదారుల ఎంపిక ఆమోదయోగంగా ఉండాలన్నారు. ఇలా అనేక గ్రామసభల్లో గందరగోళం నెలకొనగా ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సభల్లో కూడా ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. గ్రామస్థులు చేపట్టిన ఆందోళనల ప్రధాన కారణం, పథకాల ఎంపిక లో కరెక్టు సమగ్ర సర్వే లేకపోవడం అని వారు చెప్తున్నారు. పథకాలు కేవలం కొంతమంది వ్యక్తులకే అందించబడుతున్నాయని, ఆ మిగిలిన అర్హుల పేర్లను పక్కనబెట్టడం ప్రజలలో తీవ్ర నిరసనను చెలరేగించింది. గ్రామస్థులు రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాల ఎంపికలో భూములు ఉన్నవారికి కూడా పేరు రావడం, ఇందిరమ్మ ఇల్లు లో కూడా గతంలో భూములు ఉన్నవారి పేర్లు రావడం అనేది స్థానికుల ఆగ్రహాన్ని మరింత పెంచింది.



## పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వండి

ఈ విధంగా గ్రామ సభలు వివిధ పథకాల అమలు చేయడంలో గ్రామస్థుల మధ్య తలెత్తిన వివాదాలు, పథకాల ఎంపిక లో లోపాలు ప్రభుత్వాన్ని పరిశీలనలో ఉంచాయి. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకుని, ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఘర్షణ వాతావరణం

అనేక చోట్ల పోలీసులు జోక్యం చేసుకొని ఘర్షణ వాతావరణం సర్దుమనిగేలా చేశారు.గ్రామస్థులు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లను లబ్ధిదారుల జాబితాలో చూడటాన్ని తప్పుగా పరిగణించారు. అర్హుల ఎంపిక విషయంలో సృష్టించిన ఈ అసమర్థత వారికి తగిన న్యాయం అందకుండానే, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అవసరం అని వారు చెప్తున్నారు.

# అర్హులందరికి సంక్షేమ పథకాలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఇటుక బట్టీలు (బ్రిక్స్ తయారీ కంపెనీలు, ఇతర కమర్షియల్ భూములకు రైతు భరోసా వర్తించదని ఆయన తెలిపారు.

# హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం



**ఖమ్మం, 21 జనవరి 2025:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ విమర్శించారు. ఖమ్మం జిల్లాలోని తెలంగాణ భవన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ, “కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయింది. ఈ ప్రభుత్వం అబద్ధాల పునాదుల మీద నిర్మించబడినదిగా మారింది” అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం మాటలలోనే పరిమితమై, వాటి అమలులో విఫలమైందని అన్నారు. “ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు కాంగ్రెస్ పార్టీ ముళ్లకంచెలు తొలగిస్తామని చెప్పి, ఇప్పుడు ఆ ముళ్లకంచెలతో ప్రజల హక్కులను దెబ్బతీస్తోంది. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వారి పై పీడన కొనసాగిస్తుంది” అన్నారు. లగచర్ల ఘటనలో గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం, వారిని న్యాయమార్గంలోకి రాకుండా అడ్డుకోవడం, ఆర్థిక ఇబ్బందులతో కూరుకుపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయనీ, “ఈ ప్రభుత్వం వారికి అందించే న్యాయం ఏంటో మేము చూస్తున్నాము” అని అన్నారు. మాజీ శాసనసభ్యులు వెంకట వీరయ్య మాట్లాడుతూ, “గ్రామసభల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, ఇవి కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వహించబడటం బాధకరమని” అన్నారు. “గృహలక్ష్మి పథకంలో బిఆర్ఎస్ ప్రభుత్వమే ప్రజా ప్రతినిధులతో కలిసి, అన్ని విధానాలను పారదర్శకంగా అమలు చేసింది. కానీ ఇప్పుడు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే కమిటీలు ఏర్పాటు చేస్తున్నార”ని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నేతలు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్ రాజు, కూరాకుల నాగభూషణం, ఆర్ జె సి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి పొంగులేటి పర్యటన...



**ఇల్లందు జనవరి 21, మహా:** రాష్ట్ర రెవెన్యూ, సమాచారం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేడు ఇల్లందులో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు పర్యటనలో భాగంగా మరో నాలుగు రోజుల్లో మున్సిపల్ పాలకవర్గం ముగిస్తున్న సందర్భంలో చివరి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో రూ 25 కోట్లతో గోవింద్ సెంటర్ నుండి నెహ్రూనగర్, గోవింద్ సెంటర్ నుండి సత్యనారాయణపురం వరకు చేపట్టిన సీసీ రోడ్డు సెంట్రల్ లైటింగ్ డివైడర్ నిర్మాణం పనుల ప్రారంభోత్సవం, డిఎంఎఫ్ టీ నిధులతో పలు వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నారు.

# షరతులు లేకుండా ఆత్మీయ భరోసా కల్పించాలి: కొవ్వూరి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా షరతులు లేకుండా అర్హులైన వారందరికీ అందించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోవ్వూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అర్హులైన వారందరికీ అందించాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారికి మెమోరాండం అందచేశారు.. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ కి వెళ్లిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని తెలంగాణ ప్రభుత్వం షరతులు విధించిందన్నారు.